సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 12 । మార్చి । 2025




ఊరిస్తున్న పొగాకు ధరలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 24 నుంచి పొగాకు వేలం ప్రారంభం కానుంది. గతేడాది కంటే ఎక్కువ ధర వస్తుందని ఆశిస్తున్నారు. 8లో



వీడిన చిక్కుముడి

కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ బాత్‌రూం కమోడ్‌లో మృత శిశువు జననంపై చిక్కుముడి వీడింది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహరి గురువారం (ఉదయం)
భీమవరం	6.18	4.53
నరసాపురం	6.19	4.51
తాడేపల్లిగూడెం	6.14	5.02

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం



జిల్లా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న టీబీ ముక్త్ భారత్ అధికారులు

తణుకు అర్బన్: టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నోడల్ ఆఫీసర్లకు శిక్షణనిచ్చే సెంట్రల్ టీబీ డివిజన్ (సీటీడీ) బృందం మంగళవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించింది. ఇన్‌ఫెక్షన్ ప్రివెన్షన్‌లో భాగంగా వార్డులు, ల్యాబ్‌లు, పర్యావరణ ప్రాంతాలను పరిశీలించి ఇన్ఫెక్షన్లు అరికట్టేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ ఆధ్వర్యంలో వైద్యవర్గాలకు సమావేశంలో తెలిపారు.

గూడెం నేతలకు రాష్ట్ర పదవులు



హరిదాసుల రవీంద్రకుమార్



ఎస్ఎస్ ప్రసాద్



కట్టుబోయిన కృష్ణ ప్రసాద్

తాడేపల్లిగూడెం: గూడెం నియోజకవర్గ నేతలకు వైఎస్సార్‌సీపీలో పదవులు దక్కాయి. స్టేట్ ఇంటలెక్చువల్ ఫోరం సొసైటీ రాష్ట్ర కార్యదర్శిగా లాయర్ డాక్టర్ హరిదాసుల రవీంద్రకుమార్, జాయింట్ సెక్రటరీగా ఆలిండియా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎస్.ఎస్.ప్రసాద్, స్టేట్ బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా పెంటపాడు మండల జట్లపాలెం గ్రామానికి చెందిన కట్టుబోయిన కృష్ణ ప్రసాద్ ఎంపికయ్యారు. పార్టీ శ్రేణులు వీరికి అభినందనలు తెలిపాయి.

ఇంటర్ పరీక్షకు 95.5 శాతం హాజరు

భీమవరం : జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 95.5 శాతం మంది హాజరయ్యారని డీఐఈవో ఎ.నాగేశ్వరరావు చెప్పారు. జనరల్ పరీక్షకు 18,753 మందికి 18,061 మంది, ఒకేషనల్ పరీక్షకు 2,191 మందికి 1,956 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

రొయ్య రైతులను ఆదుకోవాలి



వేములదీవిలో ఆందోళన చేస్తున్న రొయ్య రైతులు

నరసాపురం రూరల్: రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్య రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం వేములదీవి పడమర గ్రామంలో ఆక్వా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆక్వా రైతులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో 100 కౌంట్ ధర కిలో రూ.290 ఉంటే ప్రస్తుతం రూ.230కి పడిపోయిందన్నారు. ఆక్వా సాగుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తణుకులో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి తదితరులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు తణుకులో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 15న తణుకు రానున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఇతర అధికారులు తణుకులో పలు ప్రాంతాలను పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో హెలిప్యాడ్, ఆడిటోరియం, బాలికోన్నత పాఠశాలలో పార్కింగ్ ప్రదేశం, బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజా వేదిక, స్టాల్స్ ప్రదర్శనకు ప్రాథమికంగా స్థలాల పరిశీలన చేశారు. సుమారు 300 మంది పార్టీ ప్రతినిధులతో నిర్వహించనున్న ముఖాముఖిలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారని, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సభా ప్రాంగణంలో 3 వేల మందితో ఏర్పాటు చేయనున్న పబ్లిక్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని చెప్పారు.

సర్కారు మోసంపై యువత పోరు

- నేడు ఏలూరు, భీమవరంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నాలు
- నిరుద్యోగ భృతి హామీ గాలికే
- 21 వేల మంది వలంటీర్లను మోసగించిన ప్రభుత్వం
- 1,378 మంది మద్యం షాపుల సిబ్బందికి ఉద్వాసన
- పాలకొల్లులో వైద్య కళాశాల పనులు నిలిపివేత
- ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెన నిధులపై మౌనం
- హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నేడు పోరుబాట



సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైద్య విద్యకు గ్రహణం పట్టించారు.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, వేల సంఖ్యలో ఉన్న ఉద్యోగాలు పీకేశారు.. నిరుద్యోగ భృతి హామీని గాలికొదిలేశారు. గత పది నెలల్లో ఉపాధి కల్పన జరగకపోగా ఉన్న ఉపాధికి చంద్రబాబు సర్కారు గండి కొట్టింది. అడుగడుగునా నిరుద్యోగులను, యువతను దగా చేస్తూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారు. పాలకొల్లు మెడికల్ కళాశాల పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. ఉమ్మడి పశ్చిమలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న ఫీజు రీయిబర్స్‌మెంట్‌ను అటకెక్కించి తల్లిదండ్రులను అప్పులపాలు చేశారు. వీటన్నింటిపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. బుధవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించి కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టనుంది. యువత పోరుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు హాజరుకానున్నారు. రెండు జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు, పార్లమెంట్ ఇన్‌చార్జులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు హాజరు కానున్నారు.

దగ్గులూరు వైద్య కళాశాలకు గ్రహణం

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏలూరు నగరంలో, పాలకొల్లులోని దగ్గులూరులో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేంద్రం ద్వారా అనుమతులు మంజూరు చేయించారు. ఏలూరులో రూ.535 కోట్లు, పాలకొల్లులో రూ.475 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో సుమారు 3 లక్షల చదరపు అడగుల విస్తీర్ణంలో కళాశాల భవనం, బాయ్స్, గరల్స్‌కు వేర్వేరుగా 90 వేల చదరపు అడుగుల్లో హాస్టళ్లతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా ప్రాజెక్టును రెండు జిల్లాలో ప్రారంభించారు. ఏలూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలను గతేడాది నుంచి ప్రారంభించారు. 150 సీట్లతో ప్రారంభమైన కళాశాలలో ఈ ఏడాది రెండో బ్యాచ్ ప్రారంభమైంది. ఇక పాలకొల్లులోని దగ్గులూరులో 60 ఎకరాల విస్తీర్ణంలో పనులు మొదలుపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 80 కోట్ల వ్యయంతో బేస్‌మెంట్, పిల్లర్లు, ఇతర నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ ఏడాది నవంబరు నాటికి పూర్తి చేసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి పాలకొల్లు వైద్యకళాశాలను ప్రారంభించాలనేది గత ప్రభుత్వ ఆలోచన. కూటమి సర్కారు కొలువుదీరడంతో పనులు నిలిచిపోయాయి. కళాశాల పూర్తయితే ఏటా 150 సీట్ల చొప్పున ఐదేళ్లల్లో 750 సీట్లు పశ్చిమగోదావరిలో పేద విద్యార్థులకు దక్కే అవకాశం ఉంది. దీనికి చంద్రబాబు ప్రభుత్వం గ్రహణం పట్టించింది.


22 వేలకుపైగా ఉద్యోగాల తొలగింపు

నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు వస్తుందని లక్షలాది మంది యువత ఆశపడి భంగపాటుకు గురయ్యారు. ఏలూరు జిల్లాలో 10,589, పశ్చిమగోదావరిజిల్లాలో 9,547 మంది వలంటీర్లను అధికారంలోకి రాగానే తొలగించేశారు. ఎన్నికల ప్రచారంలో లోకేష్ మొదలుకొని బీజేపీ నేతల వరకు అందరూ వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, రూ. 10 వేలు జీతం ఇస్తామని పదే పదే చెప్పి అధికారంలోకి రాగానే వలంటీర్ల కడుపుకొట్టారు. ప్రభుత్వ వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందిని కూడా ఒక్క సంతకంతో రోడ్డున పడేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 893 మంది, ఏలూరు జిల్లాలో 485 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్ గత ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 2,04,681 మందికి రూ. 485.23 కోట్లు, జగనన్న వసతి దీవెన ద్వారా 1,76,142 మందికి రూ.163.41 కోట్లు అందించారు. ఏలూరు జిల్లాలో 1,46,007 మంది విద్యార్థులకు రూ.383.42 కోట్లు జగనన్న విద్యాదీవెనలో.. 1,42,996 మంది విద్యార్థులకు రూ.142.96 కోట్లు వసతి దీవెన ద్వారా అందచేశారు. ఈ ప్రభుత్వం 10 నెలలు గడిచినా మొదటి సంవత్సర రీయింబర్స్‌మెంట్ ఫీజులు ఇంత వరకు చెల్లించలేదు.

పరుచుకున్న ప్రగతి

- పేదవర్గాల వారి సొంతింటి కలను సాకారం చేస్తూ జిల్లాలోని సుమారు 76,069 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు.
- ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తూ నరసాపురంలో రూ.332 కోట్ల వ్యయంతో ఆక్వా వర్శిటీ మంజూరు చేశారు.
- పాలకొల్లు మండలం దగ్గులూరులో రూ.475 కోట్ల వ్యయంతో 61 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ కళాశాల పనులు చేపట్టారు.
- పాలకొల్లులో రూ.13.50 కోట్లతో 150 పడకల ఆసుపత్రి నిర్మించగా.. నరసాపురంలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. భీమవరంలో రూ.40 కోట్ల వ్యయంతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టారు.
- తాడేపల్లిగూడెంలో రూ.36 కోట్లతో కోడేరు–నల్లజర్ల (కేఎన్ రోడ్డు)ను నాలుగు లైన్లుగా విస్తరించారు. రూ.వందల కోట్లు వెచ్చించి జిల్లాలోని ఎన్నో రోడ్లను అభివృద్ధి చేశారు.
- దాదాపు రూ.540 కోట్ల వ్యయంతో గ్రామాల్లో సచివాలయలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణం చేపట్టారు.

ఐదేళ్లు ప్రగతి పరవళ్లు



సాక్షి, భీమవరం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి 'చేయూత'నందించారు. వారి డ్వాక్రా రుణమాఫీకి 'ఆసరా' అయ్యారు.. అగ్రవర్ణాల పేద మహిళలకు ‹నేస్తం›గా నిలిచారు. పేదల చదువులకు 'అమ్మఒడి'లా వారి ఉన్నతికి విద్య, వసతి దీవెనలు అందించారు. సాగులో రైతుకు, వేట విరామంలో మత్స్యకారులకు 'భరోసా'గా ఉన్నారు. నేతన్నలకు 'నేస్తం' అయ్యారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు తెచ్చి కులమత వర్గాలు, రాజకీయాలు చూడకుండా సంక్షేమ లబ్ధిని పేదల చెంతకు చేర్చారు. నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకల నిర్వహణకు పార్టీ శ్రేణులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నాయి.

2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచే నవరత్నాల అమలుకు అడుగులు వేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తెచ్చారు. పింఛన్ కోసం అవ్వాతాతలు పడిగాపులకు చెక్ పెట్టారు. 1వ తేదీ ఉదయాన్నే ఇంటికి వెళ్లి పింఛన్ సాయాన్ని చేతికందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదల అభ్యున్నతికి వైఎస్సార్ పెన్షన్ కానుక, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, టైలర్లు, రజకులు, నాయి బ్రాహ్మణుల కోసం జగనన్న చేదోడు, డ్రైవర్ల కోసం వాహనమిత్ర, మత్స్యకారులకు మత్స్యకార భరోసా, చేనేత కార్మికుల కోసం నేతన్న నేస్తం తదితర ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆదుకున్నారు. డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో ఉమ్మడి జిల్లాలోని పేదలకు సుమారు రూ.2,500 కోట్ల లబ్ధి చేకూరింది. ఉచిత పంటల బీమా, ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేశారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలోని రైతులకు రూ.796.49 కోట్ల సాయం అందించారు. జగనన్న సురక్ష శిబిరాల ద్వారా ఉమ్మడి జిల్లాలోని దాదాపు 11.82 లక్షల మంది లబ్ధిదారులకు ఏ విధమైన సర్వీస్ చార్జీ లేకుండానే కుల ధ్రువీకరణ, ఆదాయ, జనన, మరణ, మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ తదితర 12.04 లక్షల సర్టిఫికెట్లు అందజేశారు.

ఆరోగ్యానికి ధీమా

జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లతో పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. స్పెషలిస్ట్ వైద్యులతో విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచి 15 లక్షల మందికి పైగా రోగులకు వైద్యసేవలందించారు. ఆరోగ్యశ్రీలో రూ. 5 లక్షల వరకు ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు, 1,059గా ఉన్న చికిత్సల సంఖ్యను 3,257కు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పించారు

పేదలకు డిజిటల్ విద్య

నాడు నేడు ద్వారా రూ.36,913 కోట్లతో పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారు. పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా డిజిటల్ విద్యాబోధన చేపట్టారు. 8వ తరగతి విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే ట్యాబ్‌లు అందజేశారు. జగనన్న అమ్మ ఒడి పథకంలో 1,48,342 మంది తల్లులకు రూ.887.9 కోట్లు, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలుగా రూ.770 కోట్లు సాయం అందించారు.

- సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో గడప వద్దకే సంక్షేమ లబ్ధి
- పేదల వైద్యానికి పెద్దపీట
- నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- నవరత్నాలతో పేదల ఉన్నతికి బాటలు
- జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్ల జారీ
- ఆక్వా వర్శిటీ, మెడికల్ కళాశాల మంజూరు
- నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

సంక్షేమ పథకాలతో మహిళలకు బాసట



గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అందించిన అనేక సంక్షేమ పథకాలు ఆర్థికంగా చేయూతనిచ్చాయి. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, పెళ్లికానుకతో సహా మహిళల ఖాతాలో వేశారు. నాటి ప్రభుత్వం అందించిన పథకాల ఆర్థిక సాయం మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేశాయి. నేడు పథకాల కోసం ఎదురు చూసే పరిస్థితి వచ్చింది.

– పూజారి వెంకటలక్ష్మి, భీమవరం

గ్రామాల అభివృద్ధి



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయి. గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, ఆర్బీకేలు ఈ విధంగా గ్రామాలు ఎంతో అభివృద్ధిలోకి వచ్చాయి. అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం కూడా అద్భుతంగా అభివృద్ధి చెందింది. వివిధ సామాజిక వర్గాలు కూడా అభివృద్ధిలో ముందజలో ఉన్నాయి.

– గోగులమండ చిన్న కృష్ణమూర్తి, సర్పంచ్, యండగండి

యువతకు ఉద్యోగాల కల్పన



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థ తీసుకొచ్చి లక్షల మంది యువతకు ఉపాధి కల్పించారు. సొంత ఊళ్లోనే ఉంటూ ఉద్యోగాలు చేసుకునే కలను సాకారం చేశారు. కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలకే పరిమితమైంది. అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఇంతవరకూ జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఊసే లేదు.

– వి.దివ్య, వీరవల్లి పాలెం

నేడు ఆవిర్భావ దినోత్సవం

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగ్‌లు చేయనున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం దగాతో మోసపోయిన నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన జిల్లా కేంద్రాల్లో ‹యువత పోరు› కార్యక్రమం నిర్వహించనున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలి

మున్సిపల్ ఆర్డీ నాగ నర్సింహారావు



నరసాపురం : మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా అధిక ప్రాధాన్యం ఇచ్చి పనిచేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్(రాజమండ్రి) సీహెచ్ నాగ నర్సింహారావు జిల్లాలోని కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ హాలులో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ దాదాపు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య పనుల్లో లోపాలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విధుల్లో అలసత్వం వహించే అధికారులు, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

యాక్షన్ ప్లాన్ తయారీకి ఆదేశం

కుళాయిల ద్వారా మంచినీటి సరఫరాపై జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు యాక్షన్ ప్లాన్స్ తయారు చేసి అమలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆర్డీ ఆదేశించారు. వేసవిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి రాకూడదన్నారు. నీటి వనరులను బట్టి వేసవిలో ఒకపూట కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలా? రెండు పూటలా ఇవ్వాలా? అనే అంశంపై ఆయా మున్సిపాలిటీల కమిషనర్‌లు ముందుగా తనకు నివేదిక అందజేయాలని, ప్రజలకు కూడా ముందుగా తెలియజేయాలన్నారు. ఆస్తి పన్నులు వేయాలని దరఖాస్తు పెట్టుకున్నా పన్నులు వేయకుండా నెలల తరబడి ఎందుకు తిప్పిస్తున్నారని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఫిర్యాదులు వస్తే రాతపూర్వకంగా ప్రభుత్వానికి తెలియజేస్తానని హెచ్చరించారు.

యువత పోరు విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకను బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పార్టీ నేతలకు సూచించారు. ఉదయం నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం రాష్ట్రంలో ఓ చరిత్ర అన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో జెండా ఆవిష్కరణల అనంతరం భీమవరంలో జరిగే యువత పోరు ఆందోళనకు పార్టీ నేతలు, కార్యకర్తలు తరలి రావాలని సూచించారు. రాష్ట్రంలో యువత, విద్యార్థులకు మోసపూరిత హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దగా చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారని వాపోయారు.

విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం

ఏలూరు (టూటౌన్): విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గానికి ఏలూరులోని గిరిజన భవన్‌లో ఎన్నికల అధికారి బురహన్ అలీ మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. 24 పోస్టులకు 24 నామినేషన్లు రావడంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జి. రవీంద్రబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎ.జలంధర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారిగా సీహెచ్.జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.రాధారాణి, రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర సంఘ సలహాదారుగా కె.గురుప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పి.శైలజ, ఉపాధ్యక్షులుగా దేవేంద్రనాథ్, మధుబాబు, రామ్మోహన్ రావు, గోపి, శ్రీనివాస్, ఎరుకునాయుడు, భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులుగా నాగార్జున, నరేష్, రాము, గోవిందరావు, దుర్గా ప్రసాద్, రాముడు, భార్గవ్, అర్చన, కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె జయప్రదం చేయాలి

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్లు ఏలూరు జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మోహన్ తెలిపారు. మార్చి 24 25 తేదీలలో జరిగే సమ్మెలో భాగంగా మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద బ్యాంకు ఉద్యోగులు యుఎఫ్‌బీయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

క్లుప్తంగా

నిట్‌లో క్రీడా సంబరాలు ప్రారంభం



నిట్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి

తాడేపల్లిగూడెం: చదువుతో పాటు, క్రీడల్లోనూ విద్యార్థులు రాణిస్తే మంచి భవిష్యత్‌తో పాటు శారీరకంగా, మానసికంగా ఉత్తమ ఫలితాలు ఉంటాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకరరెడ్డి అన్నారు. మంగళవారం నిట్‌లో 2024–25 క్రీడా సంబరాలను ఆయన ప్రారంభించారు. నిట్ విద్యార్థులు విద్యతో పాటు జాతీయస్థాయిలో కబడ్డీ, పవర్ లిఫ్టింగ్, క్రికెట్, చదరంగం, వాలీబాల్ వంటి పోటీల్లో ప్రతిభ కనరబరుస్తుండడం అభినందనీయమన్నారు. డీన్‌లు డాక్టర్ కె.హిమబిందు, వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ శ్రీనివాసన్, ఆచార్యులు డాక్టర్ తపస్, సుదర్శన్‌దీప, సాస్ అసిస్టెంటు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

యానాం మద్యం విక్రేత అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: ఇరగవరంలో యానాంకు చెందిన మద్యం విక్రయిస్తున్న పత్తివాడ కరుణాకర్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి అతని నుంచి 6 టిన్‌ల బీర్లు, ఒక మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

పట్టెంపాలెంలో ఇసుక తవ్వకాలు



సీజ్ చేసిన జేసీబీ

తాడేపల్లిగూడెం రూరల్: పట్టెంపాలెం ఎర్ర కాలువలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీనిపై ఫిర్యాదులు అందడంతో ఎర్ర కాలువ ఏఈ అనిల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిఘా పెట్టిన అధికారులు జేసీబీ, లారీని పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం వాటిని తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదని ఎర్ర కాలువ ఏఈ అనిల్ హెచ్చరించారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

కాళ్ల: భార్యను తనతో కాపురానికి పంపడం లేదని పిల్లనిచ్చిన మామయ్యపై చిన్న అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటనపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం వేంపాడు గ్రామానికి చెందిన యు.సత్యనారాయణ ఇంటికి అతని రెండో అల్లుడు అత్తిలి మండలం కె.ఎస్.గట్టు గ్రామానికి చెందిన కోనా కిషోర్ సోమవారం వచ్చాడు. తన భార్యని కాపురానికి పంపమని కిషోర్ తన మావయ్య సత్యనారాయణపై ఘర్షణకు దిగి కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కిషోర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊరిస్తున్న పొగాకు ధరలు

- 24 నుంచి ప్రారంభం కానున్న పొగాకు వేలం
- గతేడాది కంటే ఎక్కువ ధరపై ఆశపెట్టుకున్న రైతులు
- సరాసరి రూ.300 ఇవ్వాలని డిమాండ్



బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెంలో పొగాకు గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం 1 –2 , కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఈ నెల 24వ తేదీ నుంచి పొగాకు వేలం ప్రారంభం కానుంది. వేలం కేంద్రాల్లో కొనుగోళ్లకు సంబంధించి బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పొగాకు కేజీ ధర గతేడాది రికార్డు స్థాయిలో రూ.411 పలకడంతో ఈసారి రైతులు పోటీపడి మరీ పొగాకు సాగు చేశారు. 2025 –2026 సీజన్‌కు సంబంధించి బోర్డు 58.94 మిలియన్ల కేజీల పొగాకు విక్రయానికి అనుమతి ఇవ్వగా 70 మిలియన్ల కేజీల వరకూ ఉత్పత్తి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా పొగాకు రైతులు పోటీపడి మరీ సాగు చేయడంతో సాగుఖర్చులు అమాంతం పెరిగిపోయాయి. భూమి, బ్యారన్ కౌలుతో పాటు కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గతేడాది కంటే సరాసరి ధర ఎక్కువ వస్తేనే తాము గట్టెక్కుతామని రైతులు చెబుతున్నారు.

కర్ణాటక మార్కెట్ సరాసరి రూ. 268

ఇటీవల కర్ణాటకలో జరుగుతున్న పొగాకు వేలంలో ధరలు ఆశాజనకంగానే ప్రారంభమైనట్లు అక్కడి రైతులు చెబుతున్నారు. హై గ్రేడ్ కేజీ పొగాకు ధర రూ. 337 వరకూ పలికింది. మొత్తం సరాసరి ధర చూస్తే రూ.268.25 వరకు వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే మంళవారం నాడు రూ.216, లో గ్రేడ్ రూ 130 ధర పలికినట్లు అధికారులు తెలిపారు. కాగా ఏపీలోని ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లలో మొదటి రోజు రూ.280కు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ గతేడాది హై గ్రేడ్ కేజీ రూ.330 వరకూ పలికింది. ఈ ఏడాది ప్రారంభంలోనే పొగాకు కేజీ ధర రూ.280కు వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఈ ధరలు క్రమంగా పెరిగే అవకాశం ఉందని ఇటు రైతులు, అటు అధికారులు భావిస్తున్నారు.

గ్రేడింగ్‌లో జాగ్రత్తలు అవసరం

ఈ ఏడాది పొగాకు పంట ఆశాజనకంగా ఉండడం రైతులకు ఊరటనిచ్చే అంశం. మొత్తం ఉత్పత్తుల్లో 50 శాతానికి మొదటి రకం అంటే హై గ్రేడ్ వచ్చాయని అధికారులు చెప్తున్నారు. మిగిలిన గ్రేడులు కూడా ఆశించిన స్థాయిలో నాణ్యతగా ఉన్నాయని చెప్తున్నారు. ఇది రైతులకు సానుకూలాంశంగా మారనుంది. అయితే గ్రేడింగ్ విధానంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రేడ్‌లు వేరు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించి బేళ్లు కట్టాలని బోర్డు అధికారులు కోరుతున్నారు.



బుట్టాయగూడెంలో క్యూరింగ్ చేసిన పొగాకును తీస్తున్న దృశ్యం



కొమ్ముగూడెంలో పొగాకు బేళ్లను తొక్కుతున్న దృశ్యం

మొత్తం వేలం కేంద్రాలు – 5
పొగాకు రైతుల సంఖ్య – 12,487
సాగు విస్తీర్ణం – 28,719 హెక్టార్లు
బోర్డు అనుమతించిన ఉత్పత్తి 58.94 మిలియన్ల కేజీలు
పంట ఉత్పత్తి అంచనా 70 మిలియన్ల కేజీలు

అధికారుల సూచనలు పాటించాలి



ఈ ఏడాది పొగాకు పంట ఆశాజనకంగా ఉంది. గత ఐదేళ్లలో ఈ విధంగా పండలేదు. రైతులు అవశేషాలు లేని హీట్, సాఫ్ లేకుండా గ్రేడుల ఆధారంగా పొగాకును సిద్ధం చేసుకోవాలి. ఈ ఏడాది హై గ్రేడ్ పొగాకు పండింది. అధికారులు సూచనలు పాటిస్తే మంచి ధర వచ్చే అవకాశం ఉంది.

– బి.శ్రీహరి, ఆక్షన్ సూపరింటెండెంట్, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం -1

ధరపైనే ఆశలు



పొగాకు పంటలకు సాగు ఖర్చులు భాగా పెరిగాయి. పొలం, బ్యారన్ కౌలు, కూలి రేట్లు రెట్టింపయ్యాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో మంచి ధర వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నాము. సరాసరి రూ.300 ధర వచ్చేలా బోర్డు అధికారులు కృషి చేస్తేనే రైతులు గట్టెక్కుతారు.

– కలగర నాని, పొగాకు రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

నాణ్యమైన పొగాకును పండించాలి



బుట్టాయగూడెంలో పొగాకు పంటలను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

బుట్టాయగూడెం: రైతులు నాణ్యమైన పొగాకును పండించి అధిక దిగుబడులు సాధించాలని జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రం ఆక్షన్ సూపరింటెండెంట్ బి. శ్రీహరి సూచించారు. బుట్టాయగూడెంలో పొగాకు బోర్డు అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గద్దే శ్రీధర్ పొలంలో ప్రకృతి వ్యవసాయం, పొటాషియం, రిలీజింగ్ బ్యాక్టీరియా వాడకంపై క్షేత్ర దినోత్సవ సదస్సును నిర్వహించారు. పొగాకు సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి భూసారాన్ని పెంపొందించుకోవాలన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన పొగాకును పండించాలని కోరారు. కార్యక్రమంలో ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ ప్రశాంత్ జోషి, ఐటీసీ కంపెనీ మేనేజర్ ఆదర్శ, కంపెనీ పీఎస్ఎస్ నాగేంద్ర, పొగాకు రైతు సంఘం నాయకులు కరాటం రెడ్డినాయుడు, గొట్టుముక్కల మల్లికార్జున రావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన సత్యనాగ గణేష్

తణుకు అర్బన్: ఈనెల 14 నుంచి 16 తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సంగాడి సత్యనాగ గణేష్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.మోహన్‌బాబు తెలిపారు. ఈనెల 9వ తేదీన తణుకులో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-16 కబడ్డీ పోటీల్లో గణేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. క్రీడాకారుడు గణేష్‌తోపాటు, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను హెచ్‌ఎం మోహన్‌బాబుతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు సంక్షేమంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివన్నారాయణ

ఉండి: రైతు సంక్షేమంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ జీ శివన్నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శాస్త్రీయ సలహా సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దత్తత గ్రామాల్లో విస్తరణ కార్యక్రమాలు ఎక్కువగా కేంద్రీకృతం చేసి రైతుల అభివృద్ధికి శాస్త్రవేత్తలు దోహదపడాలని అన్నారు. రైతులకు పంట దిగుబడి, ఆదాయం పెంచడం, ఖర్చు తగ్గించడం, భూసారం పెంచడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. మార్టేరు వరి పరిశోధనా స్థానం ఉప సంచాలకుడు డాక్టర్ టీ శ్రీనివాస్ మాట్లాడుతూ దాళ్వాలో వరిని నేరుగా విత్తడం, వేస్ట్ డీకంపోజ్, జింకులోప యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుర్రపుడెక్కను కంపోస్టుగా మార్చడం, దానిని విలువ ఆధారిత ఉత్పత్తి అయిన ట్రేసంచులుగా తయారు చేయడం వల్ల కాలువల్లో కలుపు నివారించడమే కాకుండా ఆదాయ వనరుగా మార్చవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి దేవానంద్‌కుమార్, డిప్యూటీ వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ జావల్‌హుస్సేన్, జీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

పెనుగొండ: లైంగిక దాడి కేసులో నిందితుడిని మంగళవారం పెనుగొండ సీఐ రాయుడు విజయ్ కుమార్ అరెస్ట్ చేశారు. గుడిపాడుకు చెందిన ఎం.రాంబాబు సోమవారం తన ఇంటి ఎదురుగా ఉన్న ఇంటిలో ఎవరూ లేని సమయంలో దివ్యాంగురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో రాంబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్సై కే గంగాధర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృత శిశువు జననం కేసులో వీడిన చిక్కుముడి

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్



మైనర్ బాలికపై లైంగికదాడి చేసిన నిందితుడితో టౌన్ స్టేషన్‌లో సీఐ, ఎస్సైలు

కైకలూరు: కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) బాత్‌రూం కమోడ్‌లో ఈ నెల 7న మృత శిశువు జననంపై చిక్కుముడి వీడింది. ప్రసవం తర్వాత మైనర్ బాలిక పరారైన ఘటన సంచలనం కలిగించింది. ఈ కేసులో సీఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో టౌన్ ఎస్సై ఆర్.శ్రీనివాస్ పూర్తి స్థాయి దర్యాప్తు చేశారు. కేసు వివరాల్లోకి వెళితే రాచపట్నం గ్రామానికి చెందిన మైనర్ బాలికకు చిన్నతనంలో తండ్రి మరణించాడు. తల్లి సంరక్షణలో పెరుగుతున్న ఆమె పదో తరగతి పరీక్షలు తప్పగా ఇటీవల కైకలూరు కార్నర్‌స్టోన్ ఒకేషనల్ కాలేజీలో 6 నెలలు నర్సింగ్ చదివింది. ఏలూరులో నానమ్మ వద్ద బాలిక నివాసముంటుంది. పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన కార్ డ్రైవర్ ప్రత్తిపాటి వినీత్ (25)తో బాలికకు పరిచయం ఏర్పడింది. అతని బంధువులు కైకలూరు మండలం రామవరంలో ఉండటం, ఒకే సామాజిక వర్గం కావడంతో బాలికకు మరింత దగ్గరయ్యాడు. వినీత్‌కు వివాహం కాగా భార్య ఇద్దరు సంతానం ఉన్నారు. అదే విధంగా రాచపట్నం గ్రామానికి చెందిన వరుసకు స్వయాన మేనమామ కొనాల గణేష్ (35) కూడా మైనర్ బాలికకు దగ్గరయ్యాడు. గణేష్‌కు వివాహం కాలేదు. వీరిద్దరూ అనేక పర్యాయాలు బాలికపై లైంగికదాడికి పాల్పడడంతో గర్భం దాల్చినట్లు మైనర్ బాలిక ఫిర్యాదులో పేర్కొంది. ప్రసవ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోపోవడంతో శిశువు మరణించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. మైనర్ బాలిక గర్భం దాల్చడానికి కారకులైన ఇద్దరు నిందితులపై పోక్సో కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అభినందించారు.

ట్రిపుల్ ఐటీలో మెగా ఎక్స్‌పో నిర్వహణ



మెగా ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆచార్య అమరేంద్రకుమార్

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న సాంకేతిక సంబరం టెక్‌జైట్–25లో భాగంగా మంగళవారం మెగా ఎక్స్‌పో నిర్వహించారు. ఈ ఎక్స్‌పోలో 100 జట్లు పాల్గొని తమ ప్రాజెక్టులకు సంబంధించి ప్రజంటేషన్‌లను సమర్పించారు. 86 జట్లు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించగా వాటిలో 56 జట్లు అర్హత సాధించాయి. ఈ ఎక్స్‌పోలో ఏఐ, డ్రోన్, రోబోటిక్స్ అంశాలపై రూపొందించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించి న్యాయనిర్ణేతలకు వివరించారు. ఈ ఎక్స్‌పోను డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఆర్జీయూకేటీ డీన్ అకడమిక్స్ దువ్వూరు శ్రావణి ప్రారంభించారు. టెక్ జైట్ 2025 లో భాగంగా ఎన్విజన్ అకాడమి, బిస్ సంస్థ ట్రిపుల్ ఐటీతో ప్రతి ఇంజనీరింగ్ విభాగం నుంచి విద్యార్థులకు పరీక్ష పోటీలను నిర్వహించారు. యూపీఎస్సీ ఆశావాహులకు మాక్ టెస్ట్ పోటీని ఎన్విజన్ అకాడమి నిర్వహించగా, ఉత్పత్తుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలి అనే ఉద్దేశంతో బిస్ సంస్థ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో పీయూసీ, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బీ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

301 పాడి పశువులకు టీకాలు



కొమ్ముగూడెం గ్రామంలో పాడి గేదెలకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ముగూడెంలో 93 ఆవులు, 208 పాడి గేదెలకు మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్ వివరించారు. బుధవారం రామన్నగూడెంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండ్రుప్రోలులో అన్నసమారాధన



కొండ్రుప్రోలు వీరేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో వీరేశ్వరస్వామి వారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద నివేదన చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి హాజరైన 32 మంది వృద్ధులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించి, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉచితంగా రక్త, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి



ఆరుగొలను గ్రామంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ద్వారా నియంత్రణ సాధ్యమని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీరవెంకటేష్ అన్నారు. మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి అప్పారావుపేట, జగన్నాథపురం, కొత్తూరు, ఆరుగొలను, నవాబుపాలెం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగ గుంట గ్రామాల్లో క్యాన్సర్‌పై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరవెంకటేష్ మాట్లాడుతూ మహిళల్లో ఈ క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నాయని, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను గుర్తించవచ్చన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీహెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీటీసీ) : ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలో ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 1 గంట పాటు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు, ఫొన్ నెంబర్ 99592 25488కు కాల్ చేయాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి కోరారు. డిపో వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో పరిధిలోని పరిసర ప్రాంతాల్లోని ప్రయాణీకులందరూ తమకు అందజేస్తున్న ప్రజా రవాణా సర్వీసులు గురించి, సరుకు రవాణా సర్వీసులు గురించి, పుణ్యక్షేత్రాలకు నడుపుతున్న బస్సు సర్వీసులు, బస్ స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది ప్రవర్తన తదితర విషయాలకు సంబంధించి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు కాల్ చేసి తెలియజేయాలని, తద్వారా మెరుగైన సేవలను పొందేందుకు వీలు ఉంటుందని మూర్తి వివరించారు.

కుంటుపడుతున్న చెత్త సేకరణ వాహనాలు

- మూలకు చేరిన 27 క్లాప్ వాహనాలు
- అద్దాలు ఊడిపోయి ప్రమాదకరంగా మారిన కాంపాక్ట్ లోడర్ వాహనం
- ఇంటి చెత్త రోడ్డుపైనే..
- స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ భారత్.. మోడల్ తణుకు ఎట్లా



తణుకు కొమ్మాయిచెర్వు వాటర్ ట్యాంకు ప్రాంతంలో మూలకుచేర్చిన చెత్త సేకరించే క్లాప్ వాహనాలు



చెత్త సేకరించే కాంపాక్ట్ లోడర్ వాహనానికి అద్దం లేకుండా తుప్పపట్టి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పారిశుద్ధ్య నిర్వహణకు ఉపయోగించే వాహనాల సేవలు కుంటుపడుతున్నాయి. వాహనాల నిర్వహణకు ప్రాధాన్యతనివ్వకపోవడంతో ఒక్కొక్కటిగా మూలకు చేరే పరిస్థితి దాపురించిందంటూ ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు మరమ్మతులకు కునారిల్లుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో ప్రధాన భూమిక పోషిస్తున్న కాంపాక్ట్ లోడర్ వాహనం ముందుభాగం అద్దాలు ఊడిపోయి, తుప్పుపట్టి శకలాలు ఊడిపడిపోయేలా ఉందని వాహన పరిస్థితి చూస్తే అర్థమవుతోంది. అంతేకాకుండా డ్రైవర్లకు వేతనాలు, వాహనాలకు ఆయిల్ పోయించలేని స్థితిలో పూర్తి కండిషన్‌లో ఉన్న 27 క్లాప్ వాహనాలు సైతం కొమ్మాయిచెర్వు వాటర్ ట్యాంక్ వద్ద మూలకు చేరాయి. దీంతో పట్టణ పరిధిలో ఉన్న 34 వార్డుల్లోను చెత్తకుప్పలు నిత్యం దర్శనిమిస్తున్న దుస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఇంటిచెత్త నేరుగా కంపోస్టు వెళ్లే పరిస్థితి ఉండగా నేడు కూటమి పాలనలో ఏ రోడ్డులో చూసినా చెత్త కుప్పలతో దుర్గంధపూరిత వాతావరణాన్ని కల్పిస్తున్నాయని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర, మోడల్ తణుకువంటి నినాదాలు తణుకులో సాధ్యమేనా అనేది ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.

నిత్యం 50 టన్నుల చెత్త సేకరణ..

గతం నుంచి 34 వార్డుల్లోను నిత్యం 50 టన్నులకు పైగా చెత్త సేకరించాల్సి ఉండగా అందుకుగాను 8 ట్రాక్టర్లు, 27 క్లాప్ వాహనాలతోపాటు 2 కాంపాక్ట్ లోడర్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. 165 మంది పారిశుద్ధ్య కార్మికుల సేవలను 9 మంది శానిటరీ మేస్త్రిలు, సచివాలయానికి ఒకరు చొప్పున 27 మంది శానిటేషన్ సెక్రటరీలు అందుబాటులో ఉన్నారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి వాహనాలకు సంబంధించిన మరమ్మత్తులు కానీ వాటి నిర్వహణకు కానీ ఎటువంటి ప్రాధాన్యతనివ్వకపోవడంతో క్రమేపి వాహనాలు మూలకు చేరే దుస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలకు కనీసం ఇంజన్ ఆయిల్ మార్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందనే విమర్శలు చోటుచేసుకుంటున్నాయి.

జగనన్నను కలసిన రెడ్డి సంఘ నాయకులు



మాజీ ముఖ్యమంత్రి జగనన్నను కలసిన పెంటపాడు రెడ్డి సంఘ నాయకులు

పెంటపాడు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెంటపాడుకు చెందిన రెడ్డి సంఘ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా విజయవాడలో కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు నల్లమిల్లి విజయానందరెడ్డి తెలిపారు. జగనన్నతో పాటు, పార్టీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రెడ్డి సంఘ నాయకులు మేడపాటి శేషారెడ్డి, మల్లిడి హనుమంతరెడ్డి, గణేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కామేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జగన్నాథపురంలో అభివృద్ధి పనుల పరిశీలన



మంచినీటి పైపు లైన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శేషులత, చిత్రంలో ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తడంపై మంగళవారం ఎంపీపీ పొనుకుమాటి శేషులత, గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రికతో పాటు అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషులత మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి ఎద్దడి రానివ్వమని స్పష్టం చేశారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ మంచినీటి పైపు లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారని, దీంతో కొంత ఇబ్బంది ఏర్పడి ఉండవచ్చన్నారు. కొత్త వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయి ఆ నీటిని ప్రజలకు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. అప్పటి వరకు రెండు వాటర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ చంద్రిక ఆధ్వర్యంలో పైపు లైన్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారన్నారు. వాటర్ ట్యాంకు పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, పంచాయతీ కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, నాయకులు ఉండ్రాజవరపు రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



తణుకులో ఉచిత కంటి వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్ రాయల్స్, వాసవి క్లబ్ పాతవూరు, వాసవి వనితా వైభవమ్ క్లబ్, శ్రీఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి సౌజన్యంతో డాక్టర్ షేక్ బషీర్, సిబ్బంది సహకారంతో హాజరైన వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవాసవి జ్యోతి మానేపల్లి నారాయణమూర్తి మెమోరియల్ వృద్ధ జనాశ్రమంలో ఉన్న వృద్ధులకు నెలవారీ సరుకులు అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆశ్రమం ఆవరణలో జోన్ చైర్మన్ శీమకుర్తి శ్రీనివాసరావు చేతులమీదుగా జామ, మామిడి, సపోట, పూల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి సేవలో మాజీ మంత్రి కారుమూరి



దువ్వ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు మండలం దువ్వ గ్రామంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కారుమూరి వేణుగోపాలస్వామి ఆశీస్సులతో తణుకు నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్రా ధనరాజు, ఇల్లింద్రపర్రు మాజీ సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, దువ్వ సొసైటీ మాజీ అధ్యక్షుడు జేకేఆర్, ఆలయ మాజీ చైర్మన్ దుర్గ శివాజీ, ఉప సర్పంచ్ వీరబాబు, పార్టీ అధ్యక్షుడు శిరిగిశెట్టి గోపాలకృష్ణ, నాయకులు పోలపల్లి సూర్యారావు, కడియం ప్రసాద్, దండు కృష్ణంరాజు, దుర్గ పెద్దబ్బాయి, కొయ్యల సుబ్బారావు, కడియం రాంబాబు, మద్దూరు కృష్ణ పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత రాణి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఆడ పిల్లలకు చక్కని చదువులు చెప్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత రాణి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం డివిజనల్ లెవిల్‌లో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టౌన్, రూరల్ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజాత రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు, మహిళా చట్టాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మిసరస్వతి, టౌన్, రూరల్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గా భావానీ, కె.విశాలాక్షి, డి.ఏస్తేరు రాణి, జి.బేబి, కె.శ్రీదేవిలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తణుకు నరేంద్ర సెంటర్‌లో సైకిల్ ర్యాలీలో భాగంగా మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు భూమి ఇచ్చి, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా సైకిల్ యాత్ర తణుకు పట్టణానికి చేరిన సందర్భంగా తణుకు నరేంద్ర సెంటర్‌లో నిర్వహించి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సీపీఎం పార్టీ ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడానికి జిల్లా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. టిడ్కో ఇళ్లు తణుకులో 912 నిర్మించినా నేటికీ ఆనిర్మాణాలు పూర్తి కాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని, జయంతి కాలనీలో 1980 సంవత్సరానికి ముందు ఉన్న ఇళ్లు శిథిలావస్థకు చేరాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కనీసం రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాకి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అజ్జరం ప్రాంతంలోని టిడ్కో ఇళ్లు, జగనన్న, ఇందిరమ్మ, జయంతి కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబురావు, పీవీ. ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, క్రాంతికుమార్, పి. పూర్ణ, జి. రామకృష్ణ, ఆంజనేయులు, బత్తుల విజయ్, గుబ్బల గోపి, దుర్గ, వెంకటేశ్వరరావు, షేక్ వల్లి, త్రిమూర్తులు, పీడీ మూర్తి, ఉష పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



ఇరగవరంలో సమస్యలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జుత్తిగ గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో భాగంగా ఇరగవరం మండలంలోని ఇరగవరం, కొత్తపాడు, యర్రాయి చెరువు, గ్రామాల్లోని కాలనీల్లో బృందం పర్యటించి అక్కడ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదిన చలో కలక్టరెట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు కామన మునిస్వామి, పార్టీ సభ్యులు ఇల్లిందలపర్తి సత్యనారాయణ, జుత్తిగ రామాంజనేయులు, పిల్లి కోటేశ్వరరావు, పెచ్చేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలస్వామికి విశేష పూజలు

అత్తిలి: బల్లిపాడు మదన గోపాలస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. మదనగోపాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు భగవద్గీత పారాయణం చేశారు. సాయంత్రం ఆకుల అప్పారావుచే శ్రీకృష్ణ విజయం ప్రవచన కార్యక్రమం జరిగింది. స్వామి వారికి ప్రసాదంగా సమర్పించిన లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రగడ నరశింహరాజు స్వామివారికి 9 కిలోల లడ్డూను సమర్పించగా, గ్రామానికి చెందిన ధర్మవరపు రాంబాబు రూ. 8వేలకు పాడుకుని లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ లోక్‌నాథ్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్దాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, తోట నాగ వెంకట శివ గణేష్, ప్రగడ నాగ వెంకట శివదుర్గ గణేష్, గూనా పవన్ మణికంఠ గోపాలకృష్ణ, గునుపూడి నరేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, కొల్లి సంతోషం, కోటిచుక్కల పోతురాజు పాల్గొన్నారు.

ఉత్సవాలలో నేటి కార్యక్రమాలు...

మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను అద్దాల వాహనంపై గ్రామోత్సవం, సదస్యం, కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఈవో ఎల్ లోక్‌నాథ్ శ్రీనివాస్ తెలిపారు.

ఆరుళ్ల రామాలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ల గ్రామంలో పునఃనిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జలాధివాసం, ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం, పుష్పాధివాసాలు నిర్వహించారు. ధర్మకర్త మాకరాజు సతీష్ - సుధాశ్రీ దంపతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. యాగశాలార్చన, త్రికుండాత్మక కార్యక్రమాలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వినియోగం చేశారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంగళవారం గునుపూడికి చెందిన చెరుకుపల్లి సంతోష్ విద్యా సామగ్రి పంపిణీచేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వారణాశి రాధాకృష్ణ మాట్లాడుతూ పది పరీక్షలకు హాజరయ్యే 210మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయం.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ) : నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని ఐదు సెంటర్‌లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడులో ఒక సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్-1, ఎకానమిక్స్-1 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

పేకాట స్థావరంపై దాడి

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు గ్రామ శివారు పంట పొలాల్లో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడలు చేశారు. ఈ సందర్భంగా ఏడు గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4100ల నగదులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వామి మాట్లాడుతూ పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ-పంట రైతుల జాబితా సిద్ధం



ఈ పంట జాబితాను ఏర్పాటు చేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్

అత్తిలి: 2024-25 దాళ్వా పంటకు సంబంధించి ఈ పంట నమోదు చేసినటువంటి రైతుల జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మంగళవారం అత్తిలి, ఆరవల్లి, పాలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రామసభ ఏర్పాటు చేసి, రెతుల జాబితాలోని పేర్లను చదివి వినిపిస్తామన్నారు. జాబితాలో ఏమైనా తప్పొప్పులు ఉంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బందికి రాత పూర్వకంగా ఇస్తే సరి చేస్తామన్నారు. ఈ తప్పులు సరిచేయడానికి గ్రీవెన్స్ మాడ్యూల్ ఇస్తామని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద కూడా జాబితా ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. ఈ పంట ముసాయిదా జాబితాలో తప్పులు ఉంటే ఈనెల 15వ తేదీలోపు సరిచేయించుకోవాలన్నారు. ప్రస్తుతం పంట చేలు బాగున్నాయని, పైరుకు తెగుళ్ల ఉదృతిని బట్టి మందులు పిచికారీ చేయాలని, ముందస్తుగా అనవసరంగా మందులు వాడొద్దని సూచించారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అలంపురం జెడ్పీ స్కూల్లో పారిశుద్ధ్యలేమి

ముళ్ల తుప్పలు -పట్టించుకోని అధికారులు



అలంపురం జెడ్పీస్కూలు వెలుపల పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీ స్కూళ్లు అపరిశుభ్ర వాతావరణంలో ఉన్నాయి. ఈ నెల 17 నుంచి మండలంలో పలు పాఠశాలల్లో పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. కాగా స్కూలు వద్ద నిత్యం చెత్త, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. పట్టపగలే దోమలు కుడుతున్నట్లు విద్యార్థినులు చెబుతున్నారు. కాగా పబ్లిక్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో స్కూల్ సిబ్బందితో పాటు, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పదోతరగతి విద్యార్థినుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

ప్రజా చైతన్య యాత్రలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రజా చైతన్య యాత్రలు జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా సెక్రటరీ సభ్యులు చింతకాయల బాబూరావు పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన భీమవరం పట్టణంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలం నాయకత్వంలో 20 మంది దళంతో ప్రజా చైతన్యయాత్ర మంగళవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గం చేరింది. నేషనల్ హైవేపై సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీన భీమవరం కలెక్టర్ కార్యాలయంలో ధర్నా జరుగుతుందని, దరఖాస్తులు తీసుకొని లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరపరపు రంగారావు, క్రాంతి కుమార్, మల్లిపూడి రామాంజనేయులు, సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, కండేల్లి సోమరాజు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.